క్లుప్తంగా

విప్పర్తి న్యూటన్‌కు గాంధీ అవార్డు



న్యూటన్ పండుకు అవార్డు అందజేస్తున్న మాజీ ఎంపీ బాబూరావు

రాజమహేంద్రవరం రూరల్: గాంధీ జయంతిని పురస్కరించుకుని పాన్ ఇండియన్ సోషియో కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో డాక్టర్ విప్పర్తి ఐజక్ న్యూటన్ పండుకు గాంధీ ఇన్స్పిరేషనల్ అవార్డు అందజేశారు. మోరంపూడిలో మాజీ పార్లమెంట్ సభ్యుడు డాక్టర్ మిడియం బాబూరావు నివాసంలో గురువారం ఈ కార్యక్రమం జరిగింది. మూడు దశాబ్దాలుగా న్యూటన్ చేస్తున్న సామాజిక సేవా కార్యక్రమాలను తెలుసుకొని అభినందించారు. న్యూటన్ మాట్లాడుతూ ఇప్పటివరకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో 63 అవార్డులు వచ్చాయన్నారు. కార్యక్రమంలో అద్దంకి రాజాయోనా తదితరులు పాల్గొన్నారు.

రేపు 'డయల్ యువర్ ఆర్టీసీ డీఎం'

రాజమహేంద్రవరం సిటీ: ఆర్టీసీ ప్రయాణికుల సమస్యలను పరిష్కరించేందుకు గాను శనివారం డయల్ యువర్ డీఎం ప్రోగ్రాం నిర్వహించనున్నట్లు రాజమహేంద్రవరం ఆర్టీసీ డిపో మేనేజర్ కె.మాధవ్ గురువారం తెలిపారు. ఈ రోజు ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. ప్రయాణికులు 99592 25535 నంబర్‌కు కాల్ చేసి సమస్యలను తెలియజేయాలన్నారు.

వాలీబాల్ కోర్టు ప్రారంభం

కడియం: మండలంలోని దుళ్ల హైస్కూల్లో సొంత నిధులతో నిర్మించిన వాలీబాల్ కోర్టును ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి గురువారం ప్రారంభించారు. అలాగే మండలంలోని 18 మందికి రూ.12 లక్షల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. అంతకు ముందు గ్రామంలో పలువురిని ఆయన పరామర్శించారు.

జీఎస్టీలో నూతన మార్పులపై అవగాహన

రాజానగరం: జీఎస్టీలో ఇటీవల వచ్చిన మార్పులపై ప్రజలను చైతన్యపరుస్తూ వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో జిల్లాలో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె.వెంకటేశ్వరరావు అన్నారు. మండలంలోని పాలచర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ)లో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. జీఎస్టీలో చేసిన సంస్కరణలతో మందులు, వైద్య పరికరాలు, బీమా ప్రీమియాలపై పన్నుల భారం తగ్గిందన్నారు.

ఆ దుండగులను శిక్షించాలి

కంబాలచెరువు: చిత్తూరు జిల్లా దేవళంపేటలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని దహనం చేసిన దుండగులను శిక్షించాలని అడ్వకేట్స్ వెల్ఫేర్ సొసైటీ ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఆ సంఘ రాష్ట్ర ప్రతినిధులు, సీనియర్ న్యాయవాదులు రాజమహేంద్రవరంలోని జిల్లా కోర్టు గేటు వద్ద నిరసన తెలిపారు. సొసైటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధర్నాలకోట వెంకటేశ్వరరావు, సీనియర్ న్యాయవాది చింతపర్తి రాంబాబు మాట్లాడుతూ పేద, బడుగు, బలహీన వర్గాల ఆరాధ్య దైవం అంబేడ్కర్ విగ్రహాన్ని దహనం చేయడం అత్యంత దారుణమన్నారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు యార్లగడ్డ అశోక్ కుమార్, బట్టు సునీల్ కుమార్, గేదెల మోహన వంశీ, సొసైటీ రాష్ట్ర సహకార్యదర్శి బీర అరుణ్ కుమార్, సొసైటీ రాష్ట్ర ప్రతినిధులు వాకా రామ్మోహన్, తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మహాపూర్ణాహుతి



మహాపూర్ణాహుతి నిర్వహిస్తున్న అర్చకులు

సీటీఆర్ఐ: స్థానిక గోవింద క్షేత్రంలోని పద్మావతీ గోదా సమేత వేంకటేశ్వరస్వామివారి పవిత్రోత్సవాల్లో భాగంగా గురువారం మహాపూర్ణాహుతి నిర్వహించారు. కాగా.. శుక్రవారం విశేష అలంకరణ, మంగళశాసనం, స్వస్తి కార్యక్రమాలు జరుగుతాయని ఆలయ అర్చకులు తెలిపారు. దీంతో పవిత్రోత్సవాలు ముగుస్తాయన్నారు.

యువసేవా కార్యక్రమాలు ప్రారంభం

రాజమహేంద్రవరం సిటీ: రాజమండ్రి రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో నెల రోజుల పాటు జరిగే యువ సేవా కార్యక్రమాలు గురువారం ఆనం రోటరీ హాల్లో ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా నిర్వహించిన సంప్రదాయ నృత్య పోటీలు ఆకట్టుకున్నాయి. వీటికి గాయత్రి పట్నాయిక్, రాజ రాజేశ్వరి న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు చిట్టూరి సూర్యనారాయణమూర్తి, కార్యదర్శి ఇల్ల సైనాథ్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పీహెచ్‌ఎఫ్ పట్టపగలు వెంకటరావు, మాజీ డిస్ట్రిక్ట్ అసిస్టెంట్ గవర్నర్ సంజీవరావు, యూత్ ఆక్టివిటీస్ డైరెక్టర్ పీహెచ్ సుంకర రవికుమార్ పాల్గొన్నారు.

మైనర్ల దూకుడు

- బైకులు, కార్లతో వేగంగా ప్రయాణం
- అదుపు తప్పి ప్రమాదాలు
- పట్టించుకోని పోలీసులు



బాలుడు డ్రైవింగ్ చేయడంతో అదుపు తప్పి బస్సును ఢీకొన్న కారు (ఫైల్)

కంబాలచెరువు: ఆధునిక కాలంలో ద్విచక్ర వాహనం కనీస అవసరంగా మారింది. పెద్దలు, మహిళలు, మేజర్లయిన పిల్లలు వీటిని తమ రోజువారీ పనులకు వినియోగించుకుంటున్నారు. గతంలో కుటుంబంలో ఒకరికి మోటారు సైకిల్ ఉండేది. కానీ నేడు కుటుంబంలో ప్రతి సభ్యుడికి ఒక బండి ఉంటోంది. ప్రయాణం, ఉద్యోగం, చదువు, వ్యాపారం.. ఇలా వివిధ అవసరాలను ఈ వాహనాలు తప్పనిసరిగా మారాయి. అయితే ఇటీవల నగరంలో మైనర్లు ద్విచక్ర వాహనాలపై రయ్‌మంటూ దూసుకుపోతున్నారు. డ్రైవింగ్‌లో అనుభవం లేకపోయినా వేగంగా వాహనాన్ని నడుపుతున్నారు. వీరి వల్ల మిగిలిన వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

అతి వేగంగా రాకపోకలు

ఉడుకు రక్తంతో ద్విచక్ర వాహనం ఎక్కిన మైనర్లు అతి వేగంగా రాకపోకలు సాగిస్తున్నారు. వచ్చీ రాని డ్రైవింగ్‌తో, ఇరుకైన రోడ్లపై వంకర్లు తిరుగుతూ, ఎనిమిది అంకె ఆకారంలో డ్రైవింగ్ చేస్తూ వాహన చోదకులు, పాదచారులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. డ్రైవింగ్ లైసెన్సు లేకుండా, నిబంధనలను అతిక్రమించి అపసవ్య దిశలో ప్రయాణం చేస్తూ ఎదుటి వారికి ఇబ్బంది కలిగిస్తున్నారు. 15 ఏళ్లు లేని బాలురు, బాలికలు సైతం మోటారు సైకిళ్లపై రయ్ మంటూ దూసుకుపోతున్నారు. ఒక్కో వాహనంపై ముగ్గురికి పైగా కూర్చుని దూకుడుగా వెళ్లిపోతున్నారు. నగరంలో నిత్యం ట్రాఫిక్ పోలీసులు విధులు నిర్వర్తిస్తుంటారు. వీరి ముందు నుంచే మైనర్లు డ్రైవింగ్ చేసుకుంటూ వెళుతుంటారు. కనీసం వీరిని ఆపి కౌన్సెలింగ్ చేసేందుకు కూడా పోలీసులు ఆసక్తి చూపడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

అదుపు తప్పిన కారు

ద్విచక్ర వాహనాలే కాదు కార్లతో కూడా మైనర్లు విన్యాసాలు చేస్తున్నారు. ఇటీవల జరిగిన ఒక ప్రమాదం దీనికి నిదర్శనంగా నిలిచింది. నగరానికి ఒక బాలుడు ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్నాడు. అతడికి తన తండ్రి వాడుతున్న క్రెటా కారును నడపాలని ఎప్పటి నుంచో కోరిక ఉంది. ఈ నేపథ్యంలో ఇంటి వద్దే ఆ కారుని చిన్నగా నడపడం నేర్చుకున్నాడు. అనంతరం కారులో నగరంలోని రోడ్లపై తిరగడం ప్రారంభించాడు. ఇదే విధంగా ఒక రోజు ఉదయం క్రెటా కారుతో రోడ్డుపైకి వచ్చాడు. బొమ్మూరు - మోరంపూడి మధ్యలో జాతీయ రహదారిపై వేగంగా డ్రైవ్ చేస్తుండగా కారు అదుపు తప్పింది. దీంతో తొలుత డీవైడర్‌ను ఢీకొట్టాడు. అనంతరం ముందు వెళుతున్న ఒక ప్రైవేట్ బస్సును బలంగా ఢీకొట్టాడు. ఆ దెబ్బకు కారు ముందుభాగం మొత్తం ఆ బస్సులో దూరిపోయింది. ఆ కారు ముందుభాగం తుక్కుతుక్కు అయ్యింది. ఆ కుదుపునకు కారులోని బెలూన్‌లో ఓపెన్ కావడంతో హరీష్‌కు గాయాలతో బయటపడ్డాడు. ప్రమాదం సమయంలో ఈ రోడ్డుపై ద్విచక్ర వాహనచోదకులు ఎవ్వరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది.

రామ్మోహనరావు సేవలు మరువలేనివి



ధవళేశ్వరంలో జక్కంపూడి రామ్మోహనరావు విగ్రహానికి పుష్పాంజలి ఘటిస్తున్న ఆకుల వీర్రాజు, వైఎస్సార్ సీపీ నాయకులు

- వైఎస్సార్ సీపీ సీఈసీ సభ్యుడు ఆకుల వీర్రాజు
- దివంగత మాజీ మంత్రికి నివాళి

ధవళేశ్వరం: దివంగత మాజీ మంత్రి జక్కంపూడి రామ్మోహనరావు పేదలకు అందించిన సేవలు మరువలేనివని వైఎస్సార్ సీపీ సీఈసీ సభ్యుడు ఆకుల వీర్రాజు అన్నారు. రామ్మోహనరావు వర్ధంతి సందర్భంగా గురువారం ధవళేశ్వరం పోలీస్ స్టేషన్ సెంటర్‌లోని ఆయన విగ్రహానికి వైఎస్సార్ సీపీ నాయకులు పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఆకుల వీర్రాజు మాట్లాడుతూ నిరంతరం ప్రజా సంక్షేమం కోసం పరితపించిన నాయకుడు జక్కంపూడి రామ్మోహనరావు అని కొనియాడారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు సాధనాల చంద్రశేఖర్ (శివ), షట్టర్ బాషా, గోలి దేవకుమార్, దేవులపల్లి సరితారాణి, ముత్యాల పోసికుమార్, డాక్టర్ బొల్లంగి సత్యగిరి, ఒంటెద్దు కృష్ణ, శ్రీరంగం బాలరాజు, బొడ్డేటి శివాజీ, ముత్యాల జాన్, గూటం రాజు, మస్తాన్ బేగ్, గఫూర్, దాసరి ధర్మ, బాబీ, ఎల్వీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

జనయోధుడు జక్కంపూడి

కడియం: జనయోధుడు జక్కంపూడి రామ్మోహనరావు అని వైఎస్సార్ సీపీ కడియం మండల అధ్యక్షుడు యాదల సతీష్‌చంద్ర స్టాలిన్ అన్నారు. రామ్మోహనరావు వర్ధంతిని పురస్కరించుకుని జేగురుపాడులోని ఆయన విగ్రహానికి స్టాలిన్ పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా జక్కంపూడి సేవలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ఆకుల సుధాకర్, స్థానిక నాయకులు నాగిరెడ్డి మోహన్, వేల్పూరి శ్రీనివాస్ పాల్గొన్నారు.



జేగురుపాడులో జక్కంపూడి విగ్రహానికి పూలమాల వేస్తున్న సతీష్‌చంద్ర స్టాలిన్ తదితరులు

- బుర్రిలంకలో రామ్మోహనరావు విగ్రహానికి పార్టీ నాయకులు, జక్కంపూడి అభిమానులు పుష్పాంజలి ఘటించారు. కార్యక్రమంలో జేసీఎస్ మండల కన్వీనర్ తాడాల చక్రవర్తి, పార్టీ నాయకులు గాద రామకృష్ణ, ముత్యం జగదీష్, అడపా జగదీష్, ఊటుకూరి సుబ్రహ్మణ్యం, తానింకి ఏసు, నరమామిడి బాలరాజు, తూపాటి అయ్యప్ప, అన్నందేవుల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

వేతన ఒప్పందాన్ని వెంటనే అమలు చేయాలి



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న జేఏసీ నాయకులు

కడియం: మాధవరాయుడుపాలెం పంచాయతీ పరిధిలోని పేపర్ మిల్లు నూతన వేతన ఒప్పందాన్ని వెంటనే చేయాలని, ఒప్పందం తర్వాత మాత్రమే ఎన్నికలు నిర్వహించాలని ఏఐటీయూసీ ఉపాధ్యక్షుడు తాటిపాక మధు కోరారు. విజయవాడ సీతారామపురంలోని కార్మిక శాఖ కార్యాలయంలో గురువారం కార్మికశాఖ కమిషనర్ ఎంవీ శేషగిరిబాబును కలిసి ఐక్య కార్యాచరణ కమిటీ (జేఏసీ) నాయకులు అప్పారావు, రాజబాబు, నాయుడు, పల్లి ప్రసాద్, బి.శ్రీనివాస్, చిన్నారావు, బి.రాజు, రమణరావు, ఏఐటీయూసీ జాతీయ సమితి సభ్యులు తోకల ప్రసాద్, తాతయ్య తదితరులు వినతిపత్రం ఇచ్చారు. అనంతరం యూనియన్ నాయకులు మాట్లాడుతూ మిల్లు యాజమాన్యంతో వేతన ఒప్పందం చర్చలు జరుగుతున్నాయన్నారు. వేతన ఒప్పందం పూర్తయ్యేంత వరకు ఎన్నికలు వాయిదా వేయాలని, ఒప్పందం అయిన వెంటనే ఎన్నికలు నిర్వహించాలని విజ్ఞప్తి చేసినట్లు చెప్పారు. మంచి వేతన ఒప్పందం చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని తెలిపారు.

నేటి నుంచి బోధనేతర పనుల బహిష్కరణ



కడియం ఎంఈవోకు వినతిపత్రం ఇస్తున్న ఫ్యాప్టో నాయకులు

కడియం: బోధనేతర పనులు, విద్యాశక్తి కార్యక్రమాన్ని శనివారం నుంచి ఉపాధ్యాయులు బహిష్కరిస్తున్నట్లు ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఆర్గనైజేషన్ (ఫ్యాప్టో) కడియం మండల శాఖ తెలిపింది. ఈ మేరకు గురువారం కడియం ఎంఈవోకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ బోధనేతర పనులు పెరిగిపోవడంతో బోధనపై ఆసక్తి తగ్గిపోతోందన్నారు. బోధనకే పరిమితమవ్వాలని తమ రాష్ట్ర కమిటీ నిర్ణయించిన నేపథ్యంలో ఈ కార్యక్రమం చేపట్టినట్లు వివరించారు. ఉపాధ్యాయుల హాజరు, విద్యార్థుల హాజరు, మధ్యాహ్న భోజనానికి సంబంధించిన పనులను మాత్రమే ఉపాధ్యాయులు చేస్తారన్నారు. మూల్యాంకనానికి సంబంధించి పరీక్షల నిర్వహణ తప్ప ఇతర ఏ బోధనేతర పనులు చేయరన్నారు. కార్యక్రమంలో కె.రమేష్, ఎస్.అనిత, ఎస్.శ్రీనివాస్, బి.అబ్బాయి, గోపాలకృష్ణ, కె.శ్రీకాంత్ పాల్గొన్నారు.

ఆకుల వీర్రాజుకు అభినందన



ఆకుల వీర్రాజుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

రాజమహేంద్రవరం రూరల్: వైఎస్సార్ సీపీ సెంట్రల్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ (సీఈసీ) సభ్యుడిగా నియమితులైన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా డీసీసీబీ మాజీ చైర్మన్ ఆకుల వీర్రాజును గురువారం వైఎస్సార్ సీపీ కొంతమూరు నాయకులు అభినందించారు. ఆయనకు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. వారిలో పార్టీ రాష్ట్ర మైనార్టీ సెల్ అధికార ప్రతినిధి ఎంఎం అలీ, అత్తిలి భీమశంకరం, చెరుకూరి సత్యనారాయణ, ఎస్‌కే బాజీ, షేక్ చానా, ఆనం శ్రీనివాస్, తీటి ప్రసాద్ తదితరులు ఉన్నారు.

న్యాయమూర్తుల రక్షణకు చట్టం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న జార్జి ఆంటోనీ

సీటీఆర్ఐ: న్యాయమూర్తుల రక్షణకు ప్రత్యేక చట్టం చేయాలని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ మెమోరియల్ ఫ్రెండ్స్ సర్కిల్ వెల్ఫేర్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు బి.జార్జి ఆంటోని అన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి గవాయ్‌పై జరిగిన దాడిని ఖండించారు. న్యాయ వ్యవస్థ వల్లే దేశంలో ఇంకా ప్రజాస్వామ్యం బతికి ఉందన్నారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై దాడి అంటే పవిత్ర న్యాయవ్యవస్థపై దాడి చేయడమేనని ఆవేదన వ్యక్తం చేశారు. గవాయ్ కుటుంబీకులు ఎంతో ఉన్నత ఆదర్శాలు, అభ్యుదయ భావాలు కలిగిన వారన్నారు. ఆయన తండ్రి ఎంపీగా, గవర్నర్‌గా పనిచేశారని గుర్తుచేశారు. సమావేశంలో అసోసియేషన్ అధ్యక్షుడు నక్కా సోమేశ్వరరావు, గౌరవాధ్యక్షులు ఎ.ప్రసాద కుమార్, ఎ.హెచ్.లూథర్ ఫ్రెడ్రిక్, ఉపాధ్యక్షుడు కుసుమ సాయిబాబా పాల్గొన్నారు.

పద్యాలతో తెలుగుభాషపై మక్కువ

కంబాలచెరువు: తెలుగు భాషపై మక్కువ పెంచేందుకు పద్యాలు ఎంతో తోడ్పడతాయని కళాగౌతమి వ్యవస్థాపకుడు డాక్టర్ బులుసు వెంకట సత్యనారాయణమూర్తి అన్నారు. స్థానిక మోరంపూడి సిటీ స్పెషల్ మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్, ప్రాథమిక పాఠశాలలో గురువారం తెలుగు పద్యాలపై పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మూర్తి మాట్లాడుతూ పద్యం నోటికి రావడం వల్ల తెలుగు భాషలోని పద సంపద మెదడులో నిక్షిప్తమై ఉంటుందన్నారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత ముంగండి సూర్యనారాయణ మాట్లాడుతూ ఆంగ్ల మాధ్యమ చదువుల నేపథ్యంలో తెలుగు భాష వాడుక కనుమరుగై పోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల్లో తెలుగుపై అభిలాషను పెంచేందుకు కళా గౌతమి ఇటువంటి కార్యక్రమాలను పాఠశాలల్లో నిర్వహిస్తోందన్నారు. సిటీ స్పెషల్ నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కేవీవీ సత్యనారాయణ, సిటీ స్పెషల్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయిని వి.రోహిణి తదితరులు పాల్గొన్నారు.

అధిక ధరకు విక్రయిస్తే చర్యలు



రైల్వేస్టేషన్‌లోని ఓ దుకాణంలో తనిఖీ చేస్తున్న అధికారులు

రాజమహేంద్రవరం సిటీ: స్థానిక ప్రధాన రైల్వే స్టేషన్‌లో తినుబండారాలను అధిక ధరకు విక్రయిస్తున్న దుకాణాలపై కేసు నమోదు చేసినట్లు లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ ప్రశాంత్ కుమార్ తెలిపారు. లీగల్ మెట్రాలజీ కంట్రోలర్ సాయిరామ్ ఆదేశాల మేరకు గురువారం ఆయా దుకాణాలపై దాడులు చేశామన్నారు. ఈ సందర్భంగా రూ.110 విలువైన డైరీ మిల్క్ చాక్లెట్‌ను రూ.115కు అమ్ముతుండగా పట్టుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. దాడిలో పాల్గొన్న జిల్లా వినియోగదారుల రక్షణ మండలి సభ్యుడు గొట్టిముక్కల అనంతరావు మాట్లాడుతూ వస్తువులను ఎమ్మార్పీకి మించి కొనుగోలు చేయకూడదని వినియోగదారులకు సూచించారు. ఏవైనా ఫిర్యాదులుంటే 1915 టోల్ ఫ్రీ నంబర్‌కు తెలియజేయాలన్నారు.

అనాథలా మారిన నగరపాలక సంస్థ



సమావేశంలో మాట్లాడుతున్న విశ్వేశ్వరరెడ్డి

రాజమహేంద్రవరం సిటీ: పాలక వర్గం లేకపోవడంతో తల్లీతండ్రీ లేని అనాథలా నగరపాలక సంస్థ మారిందని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు టీకే విశ్వేశ్వరరెడ్డి అన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2027 జరిగే గోదావరి పుష్కరాల నేపథ్యంలో రూ.1500 కోట్ల నిధులు తెచ్చి అభివృద్ధి చేస్తామని చెప్పిన మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యేలు కనీసం పట్టించుకున్న పాపాన పోవడం లేదన్నారు. సరైన ప్రణాళికలు లేకపోవడం, అభివృద్ధి పనులు ప్రారంభం కాకపోవడంతో పుష్కరాల నిర్వహణపై అనుమానాలు కలుగుతున్నాయన్నారు. ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు రివర్ ఫ్రంట్ పేరుతో ఏదో చేద్దామని ఉత్సాహం చూపించారని, ఆ తర్వాత మంత్రివర్గం కమిటీ అనే సరికి నోరు విప్పడం లేదన్నారు. తెలుగు విశ్వవిద్యాలయానికి కనీసం వీసీ, రిజిస్ట్రార్‌ను నియమించి అడ్మిషన్లు కూడా ప్రారంభించలేదని కూటమి ప్రభుత్వంపై ధ్వజమెత్తారు. ఎంపీగా పురందేశ్వరిని ఎందుకు గెలిపించారో ప్రజలకే అర్థం కాని అయోమయ పరిస్థితులు నెలకొన్నాయన్నారు.

విద్యుత్‌కు నేడు అంతరాయం

రాజమహేంద్రవరం సిటీ: విద్యుత్ లైన్ల మరమ్మతుల నేపథ్యంలో నగరంలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుంది. ఏపీఈపీడీసీఎల్ ఈఈ నక్కపల్లి శామ్యూల్ గురువారం ఈ విషయం తెలిపారు.

- ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ రాయడుపాకలు, కోలమూరు, కొంతమూరులోని పరిమినగర్, బొమ్మన కాలనీ, ఫోర్త్ బ్రిడ్జి ప్రాంతం, సాయిరాం కాలనీ ప్రాంతాలలో సరఫరా ఉండదు.
- ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ నగరంలోని స్టేడియం రోడ్డు, టి.నగర్, శ్యామల థియేటర్ రోడ్, పెద్దాడ వారి వీధి, గోదావరి గట్టు, మూడు గుళ్ల వీధి, ఉడిపి అక్షయ వీధి, హోటల్ ఫుడ్ ఎక్స్, ఆచంట వారి వీధి, టి.నగర్, అజ్జరపువారి వీధి, బారువారి వీధి, వైగ్రామ్ రోడ్డు, చల్లపల్లివారి వీధి, న్యాపతి వారి వీధి, ఇస్కాన్ టెంపుల్, గోదావరి బండ్, ఫ్రింటోనికా కలర్ ల్యాబ్ ఏరియాల్లో విద్యుత్ ఉండదు.
- ఉదయం 9 నుంచి 11 గంటల వరకూ హుకుంపేట, ఎస్సీ కాలనీ వెంకటగిరి, గంగిరెడ్ల కాలనీ, అరవింద్ నగర్, శాటిలైట్ సిటీ బీ సీ బ్లాక్ ఏరియాల్లో సరఫరా నిలిపివేస్తారు.

గౌరమ్మా.. దీవించమ్మా..





పుష్కరాల రేవులో మహిళల పూజలు



అట్లతద్దె పండగను మహిళలు గురువారం ఘనంగా జరుపుకొన్నారు. వేకువజామునే ఉపవాస దీక్ష చేపట్టి, అమ్మవారికి పూజలు చేసి, అట్లు నివేదించారు. సాయంత్రం దీక్ష విరమించి అమ్మవారికి పూజలు జరిపారు. నగరంలోని పుష్కరాలరేవుకు మహిళలు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. ముత్తయిదువులకు వాయినాలు అందజేశారు.

- సీటీఆర్ఐ

రూ.2.51 లక్షల విలువైన బాణసంచా సీజ్

కడియం: కడియపులంక గ్రామంలో అనుమతులు లేకుండా బాణసంచాను అక్రమంగా నిల్వ ఉంచిన ముగ్గురిని అదుపులోకి తీసుకుని, వారి నుంచి రూ.2.51 లక్షల విలువైన మందు గుండు సామగ్రిని స్వాధీనం చేసుకున్నట్లు కడియం ఇన్‌స్పెక్టర్ ఎ.వెంకటేశ్వరరావు తెలిపారు. ఆ గ్రామంలోని ఇళ్లు, షాపుల్లో నిల్వ ఉంచిన బాణసంచాపై గురువారం తనిఖీలు చేశామన్నారు. ఈ సందర్భంగా అక్రమంగా నిల్వ చేసిన గెల్లి వెంకటేశ్వరరావు, గ్రంధి శ్రీరామచంద్రమూర్తి, బలబద్రుని నాగ వీర సూర్య ప్రకాశ్‌లను అదుపులోకి తీసుకుని క్రిమినల్ కేసు నమోదు చేశామన్నారు. వ్యాపారులందరూ నిబంధనలను తప్పకుండా పాటించాలని ఆయన ఆదేశించారు.

22న గిరి గోవర్ధన పూజ

రంగంపేట: జి.దొంతమూరు గ్రామంలోని ఇస్కాన్‌లో ఈ నెల 22న గిరి గోవర్ధన పూజా మహోత్సవం నిర్వహించనున్నట్టు ఆ సంస్థ ప్రతినిధులు గురువారం ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 10 గంటలకు గోపూజ అనంతరం సత్య గోపీనాథ్ ప్రభూజీచే గోవర్ధన లీలా ప్రవచనం, గిరి గోవర్ధన పూజ, హారతి, సాంస్కృతిక కార్యక్రమాలు, మధ్యాహ్నం అన్న ప్రసాద వితరణ ఉంటుందన్నారు. కార్తిక మాసంలోని మొదటి రోజు జరిగే ఆ అన్నసమారాధనలో భక్తులందరూ పాల్గొనాలని ఆయన కోరారు.

సినిమాలు



శ్యామల	అరి
సూర్యమినీ	ట్రాన్
సూర్యప్యాలెస్	కాంతారా-1
స్వామి	ఓజీ
అనుశ్రీ	ఓజీ
శివజ్యోతి	మమ్మీ ఈజ్ బ్యాక్
రాజా	కాంతారా-1
ఊర్వశి	కాంతారా-1
మేనక	ఇడ్లీకొట్టు
రంభ	మిరాయ్
అప్సర	ట్రాన్
అశోక	కానిస్టేబుల్, శశివదనే
నామవరం	
వీఎస్ మహల్	కాంతారా-1
ధవళేశ్వరం	
మురళీకృష్ణ	కాంతారా-1
కడియం	
వెంకట సూర్య	కాంతారా-1